Digital, tmedia.net.in

# టీ-మీడియా

మెయిన్ ఎడిషన్

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక : 304
పేజీలు : 3
ఆదివారం 07.06.2026

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ




# ఎవరెంత ఏడ్చినా ఆర్ఆర్ఆర్, అభివృద్ధి ఆగదు



- మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సీఎం రేవంత్‌రెడ్డి
- కోహెడలో 239 ఎకరాల్లో పండ్ల మార్కెట్

**టి మీడియా, జూన్ 6 , హైదరాబాద్ బ్యూరో:** కారు పూర్తిగా చెడిపోయి కార్ఖానాలో ఉందని రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఎన్ని చేసినా చెడిపోయిన ఆ కారు ఇక పనికిరాదని బీఆర్ఎస్?ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. కోహెడలో సమీకృత మార్కెట్, ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన ప్రసంగించారు.

### అంతర్జాతీయ గుర్తింపు ఖాయం

ఒకప్పుడు నగరానికి సరపడా కాయగూరలు, పాలు రంగారెడ్డి జిల్లా నుంచి వచ్చేవని, ఓఆర్?ఆర్, విమానాశ్రయం వచ్చాక ఇక్కడ స్థిరాస్తి వ్యాపారం పెరిగిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఫలితంగా రంగారెడ్డి జిల్లాలో వ్యవసాయం కుంటుపడిందని చెప్పారు. ఇంటిగ్రేటెడ్ పండ్ల మార్కెట్ నిర్మిస్తామని తాను ఎంపీగా ఉన్నప్పుడు హామీ ఇచ్చానన్న రేవంత్ రెడ్డి



పండ్లు, కూరగాయలు అన్నీ లభించేలా కోహెడా మార్కెట్?ను నిర్మిస్తున్నామన్నారు. ఈ మార్కెట్ మనకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తీసుకొస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రైతులు కేవలం వరి, జొన్నలు, పత్తి, మిర్చి పంటలే పండిస్తున్నారన్న సీఎం పరిమితంగా సాగు చేయడం వల్లే కూరగాయల ధరలు పెరిగిపోతున్నాయన్నారు. కాలుష్యం వెదజల్లే ఫార్మాసిటీని వద్దని, ఫ్యూచర్?సిటీని నిర్మిస్తున్నామన్నారు. మహానగరాన్ని నిర్మించి ప్రపంచ వ్యాప్తంగా 500 కంపెనీలు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నామన్నారు. తాము అభివృద్ధి చేస్తుంటే, మేం రాగానే ఫ్యూచర్ సిటీ రద్దు చేస్తామని బీఆర్ఎస్? చెబుతోందని రేవంత్ రెడ్డి మండిపడ్డారు.

### ఎవరెంతా ఏడ్చినా ఆర్ఆర్ఆర్, అభివృద్ధి ఆగదు

రిజిస్ట్రేషన్ ఆఫీసుల్లో దారుణమైన పరిస్థితులు ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తాగేందుకు నీళ్లు ఉండవు, నిలబడే చోటు లేదని వివరించారు. అలాంటి వాటన్నింటిని దృష్టిలో ఉంచుకునే అన్ని వసతులతో కూడిన ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రార్ ఆఫీసులు నిర్మిస్తున్నామన్నారు. అంతర్జాతీయ సదుపాయాలు కల్పించుకుంటేనే అంతర్జాతీయ నగరం అవుతుందని అభిప్రాయపడ్డారు. ఎవరెంత ఏడ్చినా ఆర్?ఆర్?ఆర్, అభివృద్ధి ఆగదని స్పష్టం చేశారు. వ్యవసాయం దండగ కాదు పండగ అని నిరూపిస్తున్నామని పేర్కొన్నారు. వరి వేస్తే ఉరే అని చెప్పే రోజులు ఇవి కావన్నారు. రైతులకు వరిపై క్వింటాల్?కు రూ.500 బోనస్? ఇస్తున్నామని రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. కాళేశ్వరం కూలేశ్వరం అయినా దేశంలోనే అత్యధిక వరి పండిస్తున్నామని వివరించారు. రైతులు ఏవిధంగా వడ్లు పండించినా అవి కాళేశ్వరం నీళ్లతోనే అని దుష్ప్రచారం చేశారని రేవంత్ రెడ్డి మండిపడ్డారు.

### ప్రపంచస్థాయి ప్రమాణాలతో కోహెడ మార్కెట్

హైదరాబాద్? నగర శివారు ప్రాంతం కోహెడలో అంతర్జాతీయ సమీకృత ఫ్రూట్ మార్కెట్? కొలువు దీరబోతోంది. ప్రపంచ స్థాయి నాణ్యతా ప్రమాణాలతో సాంకేతిక హంగులతో కూడిన మార్కెట్? నిర్మాణానికి, ఇంటిగ్రేటెడ్ సబ్?రిజిస్ట్రార్ కార్యాలయాలకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. కోహెడలో 239 ఎకరాల్లో పండ్ల మార్కెట్?ను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో మొత్తం 3387.35 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో సర్కారు నిర్మిస్తోంది.

### కోహెడ మార్గంలో నిలిచిన రాకపోకలు

మరోవైపు సీఎం పర్యటన దృష్ట్యా పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించడంతో కొహెడ- హయత్?నగర్ మార్గంలో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. సంఘీ నుంచి ఓఆర్?ఆర్ సర్వీస్ రోడ్డులో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పోలీసులు వాహనాలను నిలిపివేయడంతో ద్విచక్రవాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

# దేశవ్యాప్తంగా.. వానలే వానలు






## తెలుగు రాష్ట్రాల్లోనూ భారీ వర్షాల హెచ్చరిక

**టీ మీడియా, జూన్ 6, ఢిల్లీ బ్యూరో:** కేరళలో నైరుతి రుతుపవనాలు ప్రవేశించిన నేపథ్యంలో దేశంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. రాబోయే రెండు నుంచి మూడు రోజుల్లో దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) శనివారం వెల్లడించింది. జూన్ 6 నుంచి 12వ తేదీల వరకు తమిళనాడు, పుదుచ్చేరి, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ రాష్ట్రాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తాజాగా పేర్కొంది.

### అవసరమైతే తప్ప బయటకు వెళ్లొద్దు: ఐఎండీ

తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. ముఖ్యంగా కోస్తా ప్రాంతాలు సహా మరికొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించింది. ప్రజలు అవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని, స్థానిక అధికారుల సూచనలు పాటించాలని సూచించింది. ఇక ఈశాన్య భారతంలోని అన్ని ఏడు రాష్ట్రాల్లో జూన్ 12 వరకు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. అసోం, మేఘాలయ, అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, మణిపూర్, మిజోరం, త్రిపుర రాష్ట్రాల్లో వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండొచ్చని పేర్కొంది. కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్న ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. అండమాన్ నికోబార్ దీవులు, బంగాల్ బెంగాల్, సిక్కిం ప్రాంతాల్లో కూడా విస్తృతంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ వెల్లడించింది. ఈ ప్రాంతాల్లో జూన్ 12 వరకు వర్షాలు కొనసాగవచ్చని అంచనా వేసింది.

### భారీ నుంచి అతి భారీ వర్షాలు

నైరుతి రుతుపవనాల ప్రభావం పశ్చిమ తీర ప్రాంతాల్లో మరింత స్పష్టంగా కనిపిస్తోంది. కర్ణాటక తీర ప్రాంతాలు, కేరళ, గోవా, మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాల్లో వరుసగా పలురోజుల పాటు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని ఐఎండీ తెలిపింది. కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. దీంతో ఆయా రాష్ట్రాల యంత్రాంగాలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. మరోవైపు దేశ రాజధాని దిల్లీలో గత కొన్ని రోజులుగా వాతావరణం ఆహ్లాదకరంగా మారింది. వర్షాలు, ఉరుములు, ఈదురుగాలుల కారణంగా ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే తగ్గాయి. శుక్రవారం దిల్లీలో గరిష్ఠ ఉష్ణోగ్రత 35.8 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ఇది సాధారణ స్థాయి కంటే 4.2 డిగ్రీలు తక్కువ. కనిష్ఠ ఉష్ణోగ్రత 26 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. శనివారం దిల్లీలో పాక్షిక మేఘావృత వాతావరణం కొనసాగుతుందని ఐఎండీ అంచనా వేసింది. తేలికపాటి వర్షాలు, ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. దీంతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించింది. సముద్ర తీర ప్రాంతాల్లో నివసించే ప్రజలు, మత్స్యకారులు ప్రత్యేక అప్రమత్తత పాటించాలని వాతావరణ శాఖ హెచ్చరించింది. అరేబియా సముద్రం, బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాల్లో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. నైరుతి అరేబియా సముద్రానికి ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో గంటకు 45 నుంచి 55 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉండగా, కొన్ని సందర్భాల్లో అవి 65 కిలోమీటర్ల వేగానికి చేరవచ్చని పేర్కొంది. మహారాష్ట్ర, గోవా, కర్ణాటక, కేరళ తీర ప్రాంతాలతో పాటు బంగాళాఖాతంలోని పలు ప్రాంతాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. గాలుల వేగం కొన్ని సందర్భాల్లో 60 కిలోమీటర్ల వరకు పెరగవచ్చని హెచ్చరించింది. ఈ పరిస్థితుల నేపథ్యంలో మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. ఇదిలా ఉండగా, దేశంలోని కొన్ని ప్రాంతాల్లో ఇంకా ఎండల తీవ్రత కొనసాగనుంది. శనివారం కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాం ప్రాంతాల్లో అక్కడక్కడ వడగాల్పుల పరిస్థితులు ఉండే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. అలాగే జూన్ 8 నుంచి 12 వరకు ఉత్తరప్రదేశ్, పశ్చిమ రాజస్థాన్‌లోని కొన్ని ప్రాంతాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. దేశవ్యాప్తంగా రుతుపవనాలు క్రమంగా ముందుకు సాగుతున్న నేపథ్యంలో రాబోయే రోజుల్లో మరిన్ని ప్రాంతాలకు వర్షాలు విస్తరించే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ప్రజలు తాజా వాతావరణ హెచ్చరికలను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# మోదీ ఎలాంటి భారత్‌ను నిర్మించాలనుకుంటున్నారు?

- ప్రధాని నాయకత్వంపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు

**టి మీడియా, జూన్ 6 , ఢిల్లీ బ్యూరో**

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించింది. దేశంలోని అన్ని వర్గాల ప్రజల హక్కులు, ప్రయోజనాలు దెబ్బతింటున్నాయని ఆరోపించిన కాంగ్రెస్, అసలు మోదీ ఎలాంటి భారత్‌ను నిర్మించాలనుకుంటున్నారంటూ ప్రశ్నించింది. మహిళలు, రైతులు, పేదలు, దళితులు, ఆదివాసీలు, విద్యార్థులు సహా సమాజంలోని ప్రతి వర్గం ప్రభుత్వ విధానాల వల్ల నష్టపోతోందని ఆరోపించింది.



### ప్రాథమిక సూత్రాలను పక్కనపెట్టి!

ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ తన అధికారిక ఎక్స్?లో ఖర్గే పాత ప్రసంగానికి సంబంధించిన ఓ వీడియోను పంచుకుంది. ఆ వీడియోలో రాజ్యసభలో మాట్లాడుతున్న ఖర్గే, కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ విలువలను విస్మరిస్తోందని ఆరోపించారు. సమానత్వం, సామాజిక న్యాయం వంటి ప్రాథమిక సూత్రాలను పక్కనపెట్టి దేశాన్ని ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతోందని ఆయన విమర్శించారు. మీరు ఎలాంటి భారత్‌ను నిర్మించాలనుకుంటున్నారు? ప్రజల పన్నుల డబ్బుతో అనేక పథకాలు ప్రారంభించి ప్రచారం చేయడం ద్వారా కొంతకాలం ప్రజలను మభ్యపెట్టవచ్చు. కానీ మహిళలు, రైతులు, పేదలు, దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాలు, విద్యార్థుల హక్కులను దెబ్బతీశారు. దీంతో వారు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు" అని ఖర్గే పేర్కొన్నారు.

అదే సమయంలో ఇటీవల పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై కూడా కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుంది. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఇంధన ధరల పెంపును తీవ్రంగా తప్పుబట్టారు. ఎన్నికల సమయంలో ధరలను నియంత్రించి, ఎన్నికలు ముగిసిన తర్వాత విడతల వారీగా ప్రజలపై భారం మోపుతున్నారని ఆయన ఆరోపించారు. ఆ అంశంపై ఎక్స్‌లో స్పందించిన రాహుల్ గాంధీ, "ద్రవ్యోల్బణ మోదీ మరోసారి దాడి చేశారు. పెట్రోల్, డీజిల్ ధరలను విడతల వారీగా పెంచుతూ ప్రజల జేబులను నిశ్శబ్దంగా ఖాళీ చేస్తున్నారు. దేశంపై ఆర్థిక తుపాన్ ముంచుకొస్తోందని నేను నెలలుగా హెచ్చరిస్తున్నా, ఆ సమయంలో మోదీజీ ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్నారు. ఎన్నికలు ముగియగానే ఇంధన ధరలను భారీగా పెంచారు" అని విమర్శించారు.

ఇకపై కూడా ధరల పెంపు కొనసాగుతుందని ఆయన ఆరోపించారు. ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం, ఎన్నికలు ముగిసిన తర్వాత ప్రజలపై భారం మోపడం మోదీ ప్రభుత్వానికి అలవాటు అయిపోయిందని రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా ఇంధన ధరల పెంపుపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల వల్ల కుటుంబాల నెలవారీ ఖర్చులు మరింత పెరుగుతున్నాయని ఆయన అన్నారు. ప్రతి ఇంధన ధరల పెంపు దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు.

ఇంధన దోపిడీ రోజురోజుకూ కొనసాగుతోంది. పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగిన ప్రతిసారి కుటుంబాల బడ్జెట్‌పై అదనపు భారం పడుతోంది. రైతుల నుంచి చిన్న, మధ్య తరహా పరిశ్రమల వరకు ప్రతి వర్గం దీనివల్ల నష్టపోతోంది" అని ఖర్గే ఆరోపించారు. కాగా, ఇటీవల కేంద్ర ప్రభుత్వం వరుసగా పలు మార్లు

మిగతా 3లో..

# పట్టాలెక్కిన 'సౌత్ కోస్ట్ రైల్వే'

- గుంతకల్లు, విజయవాడ డివిజన్లదే పైచేయి!

**టి మీడియా, జూన్ 6 , విజయవాడ :**

ఈ నెల 1వ తేదీన విశాఖపట్నం కేంద్రంగా కార్యకలాపాలు ప్రారంభించిన 'సౌత్ కోస్ట్ రైల్వే జోన్' పరిధిలోని వివిధ డివిజన్ల రూట్- రన్నింగ్ కిలోమీటర్ల గణాంకాలపై స్పష్టత వచ్చింది. గుంతకల్లు డివిజన్ అత్యధిక రూట్ - కిలోమీటర్ల నెట్‌వర్క్‌ను కలిగి ఉండగా విజయవాడ డివిజన్ రన్నింగ్ ట్రాక్ కిలోమీటర్ల పరంగా మిగిలిన వాటి కంటే ముందుంది. ఈ జోన్ నాలుగు రాష్ట్రాల్లో విస్తరించి ఉన్నప్పటికీ దీని పరిధిలో 97.75 శాతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే ఉంది.

**రూట్-కిలోమీటర్ల నెట్‌వర్క్**

సౌత్ కోస్ట్ రైల్వే జోన్‌లో విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, గుంతకల్లు డివిజన్లు ఉన్నాయి. ఈ జోన్ పరిధిలోని రైలు మార్గాల పొడవును అధికారులు రెండు రకాలుగా లెక్కించారు. కేవలం ప్రధాన రైల్వే లైన్ల పొడవును "రూట్ కిలోమీటర్లు"గా పిలుస్తారు. ఇది మొత్తం 3,532 కిలోమీటర్లుగా ఉంది. అలాగే ప్రధాన లైన్లతో పాటు డబుల్, ట్రిపుల్, బైపాస్ లైన్లన్నింటినీ కలిపి "రన్నింగ్ ట్రాక్ కిలోమీటర్లు"గా పరిగణిస్తారు. ఇది మొత్తం 6,455 కిలోమీటర్లుగా నమోదైంది.




ఈ జోన్‌లోని మిగిలిన మూడు డివిజన్లతో పోలిస్తే విశాఖపట్నం డివిజన్ చిన్న నెట్‌వర్క్ (460 రూట్ కిలోమీటర్లు) కలిగి ఉన్నప్పటికీ ఇది 979 రన్నింగ్ ట్రాక్ కిలోమీటర్లను కలిగి ఉంది. గుంతకల్లు డివిజన్‌తో పోలిస్తే విజయవాడ గుంతకల్లు డివిజన్ అత్యంత విస్తృతమైన రూట్-కిలోమీటర్ల నెట్‌వర్క్‌ను కలిగి ఉండగా విజయవాడ డివిజన్ అత్యధిక రన్నింగ్ ట్రాక్ కిలోమీటర్లను కలిగి ఉంది. గతంలో ఉన్న వాల్తేరు డివిజన్‌ను విశాఖపట్నం రాయగడ డివిజన్లుగా పునర్వ్యవస్థీకరించిన నేపథ్యంలో విశాఖపట్నం డివిజన్ సౌత్ కోస్ట్ జోన్‌లో విలీనం చేశారు.

**విజయవాడ-గూడూరు మార్గంలో ట్రిపుల్ లైన్**

డివిజన్ రూట్ పొడవు (రూట్ కిలోమీటర్లలో) తక్కువగా ఉన్నప్పటికీ విజయవాడ-గూడూరు మార్గంలో ట్రిపుల్ లైన్ విజయవాడ వద్ద బైపాస్ లైన్ల వంటి అంశాల కారణంగా ఇది ఎక్కువ రన్నింగ్ ట్రాక్ కిలోమీటర్లను కలిగి ఉంది.

**మూడు రాష్ట్రాలలో చిన్న భాగాలు**

సౌత్ కోస్ట్ జోన్ నాలుగు రాష్ట్రాల్లో విస్తరించి ఉంది. దీని పరిధిలో అత్యధిక భాగం అంటే 97.75 శాతం మన రాష్ట్రంలోనే ఉంది. మిగిలిన చిన్న భాగాలు కర్ణాటక, తెలంగాణ తమిళనాడు రాష్ట్రాల్లో ఉన్నాయి. కర్ణాటకలోని ఈ మార్గంలో గుంతకల్లు నుంచి వాడి బళ్లారి వైపు విస్తరించి ఉన్న విభాగాలతో కూడిన 47.03 కిలోమీటర్ల మేర విస్తీర్ణం 'సౌత్ కోస్ట్ జోన్' పరిధిలోకి వస్తుంది .అలాగే విజయవాడ నుంచి కాజీపేట మార్గంలో తెలంగాణలోని 25 రూట్-కిలోమీటర్ల విభాగం కూడా ఈ కొత్త జోన్‌లో చేర్చారు. అదనంగా చిత్తూరు మీదుగా పాకాల జంక్షన్ నుంచి కాట్పాడికి వెళ్లే మార్గంలో తమిళనాడు పరిధిలోని 6.86 రూట్-కిలోమీటర్ల మేర ఉన్న మార్గం 'సౌత్ కోస్ట్ జోన్' పరిధిలోకి వస్తుంది.

# ప్యాకింగ్‌కు న్యూస్ పేపర్లు వాడొద్దు

- **ఫుడ్ సేఫ్టీ అథారిటీ హెచ్చరిక**

**టి మీడియా, జూన్ 6 , ఢిల్లీ బ్యూరో :**
ఆహార పదార్థాలను వార్తాపత్రికల్లో చుట్టడం, ప్యాక్ చేయడం లేదా వడ్డించడం వెంటనే నిలిపివేయాలని భారత ఆహార భద్రతా ప్రమాణాల సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) పేర్కొంది. ఇలా చేయడం వినియోగదారుల ఆరోగ్యానికి తీవ్రమైన ముప్పుగా మారే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ మేరకు ఆహార వ్యాపార సంస్థలకు సూచనలు చేసింది.

**ముంబయి ఘటనతో అప్రమత్తమైన అధికారులు**
ఇటీవల ముంబయిలోని ఓ ప్రముఖ వడపావ్ విక్రేత వార్తాపత్రికల్లో ఆహారం వడ్డిస్తున్న ఘటన వెలుగుచూసింది. దీంతో ఎఫ్ఎస్ఎస్ఏఐ పశ్చిమ ప్రాంత అధికారులు, మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ గ్రేటర్ ముంబయి సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి చర్యలు చేపట్టాయి. ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా నగరాలు, పట్టణాల్లో అవగాహన పెంచడం, ఆహార భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయడమే లక్ష్యమని అధికారులు తెలిపారు.

**వార్తాపత్రికలు ఎందుకు ప్రమాదకరం?**
ఎఫ్ఎస్ఎస్ఏఐ వివరాల ప్రకారం, వార్తాపత్రికలు ఆహార పదార్థాల ప్యాకింగ్?కు అనుకూలం కావు. ప్రింటింగ్ ఇంక్‌లో సీసం (లెడ్) సహా పలు లోహాలు, రసాయనాలు, రంగు పదార్థాలు, బైండర్లు ఉంటాయి. ముఖ్యంగా వేడిగా లేదా నూనె ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలను వార్తాపత్రికల్లో చుట్టినప్పుడు ఈ రసాయనాలు ఆహారంలోకి చేరే ప్రమాదం ఉంటుంది. ఇలాంటి పదార్థాలు



ఎక్కువ కాలం నుంచి ఉపయోగిస్తూ ఉన్నట్లయితే పలు దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు దారితీసే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రసాయన కాలుష్యంతో పాటు వార్తాపత్రికలను ముద్రణ, రవాణా, పంపిణీ చేసేటప్పుడు వాటిపై దుమ్ము, ధూళి పడి మురికి అయిపోతాయి. దీంతో వాటిపై వ్యాధులకు కారణమయ్యే సూక్ష్మక్రిములు చేరే అవకాశం ఉంటుంది. పేపర్లలో ఆహారం ఉంచడం వల్ల ఫుడ్ పాయిజనింగ్ వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని పేర్కొంది.

**ఇప్పటికే నిబంధనల్లో నిషేధం**
ఆహార భద్రత, ప్రమాణాల (ప్యాకేజింగ్) నిబంధనలు--2018 ప్రకారం వార్తాపత్రికలు లేదా ఇతర ముద్రిత కాగితాలను ఆహార పదార్థాల నిల్వ, ప్యాకింగ్, వడ్డింపునకు ఉపయోగించడంపై నిషేధం విధించినట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ స్పష్టం చేసింది. ఈ నిబంధనలు వీధి ఆహార విక్రేతలు, రెస్టారెంట్లు, క్లౌడ్ కిచెన్లు, క్యాటరింగ్ సంస్థలు, క్విక్ సర్వీస్ రెస్టారెంట్లు (క్యూఆర్?ఎస్?), చిన్న ఆహార దుకాణాలు, మొబైల్ ఫుడ్ విక్రేతలకు కూడా వర్తిస్తాయని తెలిపింది.

**వినియోగదారులు కూడా అప్రమత్తంగా ఉండాలి**
ఆహార వ్యాపార సంస్థలు తప్పనిసరిగా ఆమోదిత ఫుడ్ గ్రేడ్ ప్యాకేజింగ్ పదార్థాలనే ఉపయోగించాలని ఎఫ్ఎస్ఎస్ఏఐ సూచించింది. అలాగే వినియోగదారులు కూడా వార్తాపత్రికల్లో ప్యాక్ చేసిన లేదా వడ్డించిన ఆహారాన్ని కొనుగోలు చేసే విషయంలో జాగ్రత్తగా ఉండాలని కోరింది. ఆహార భద్రతా చట్టం--2006 అమలును మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి చర్యలు తీసుకుంటున్నామని, సురక్షితమైన, పర్యావరణహిత ప్యాకేజింగ్ విధానాలను ప్రోత్సహిస్తున్నామని ఎఫ్ఎస్ఎస్ఏఐ వెల్లడించింది. 2023లో కూడా ఫుడ్? సేఫ్టీ అథారిటీ ఇలాంటి సూచనలే చేసింది. ఆహార పదార్థాల ప్యాకింగ్?కు న్యూస్?పేపర్లు ఉపయోగించవద్దని తెలిపింది. చాలా చోట్ల సమోసాలు, పకోడీలు వంటి వేయించిన ఆహార పదార్థాల్లోని అదనపు నూనెను పీల్చుకునేందుకు వార్తా పత్రికలను ఉపయోగిస్తుంటారు. అయితే ఈ విధానం కూడా ప్రమాదకరమేనని ఎఫ్ఎస్-ఎస్ఏఐ పేర్కొంది. వేడి ఆహారంతో పత్రికలోని ఇంక్ మరింత వేగంగా ఆహారంలోకి కలిసే అవకాశం ఉండటంతో ఆరోగ్య సమస్యల ముప్పు పెరుగుతుందని వివరించింది. దేశంలో ఆహార భద్రతను మరింత బలోపేతం చేయడంలో భాగంగా సురక్షితమైన ఫుడ్ గ్రేడ్ ప్యాకేజింగ్ పదార్థాలను ప్రోత్సహిస్తున్నట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ తెలిపింది. ఈ నిబంధనలు కచ్చితంగా అమలయ్యేలా 2023లో రాష్ట్ర ఆహార భద్రతా అధికారులతో కలిసి చర్యలు చేపట్టింది.



## ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర చైర్మెన్ గా జయరామయ్య

**టీ మీడియా, జూన్ 6 ,పెబ్బేరు:**
పెబ్బేరు పట్టణంలో ఆర్యవైశ్య మహాసభ టూరిజం రాష్ట్ర చైర్మెన్ గా వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణానికి చెందిన పుప్పాల జయరామయ్య ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ చేతులమీదుగా జయరామయ్య నియామక పత్రం అందుకున్నారు ఈ సందర్భంగా వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు పుప్పాల జయరామయ్య దంపతులను శాలువాతో ఘనంగా సత్కరించారు పెబ్బేరు వాసికి రాష్ట్ర స్థాయిలో గొప్ప పదవి రావడంతో ఆయనను అందరూ అభినందించారు కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దేవరశెట్టి మహేష్ ఆలయ కమిటీ యువజన మహిళా సంఘం సభ్యులు ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

# నిద్రహారాలు మాని కుభీర్ రైతుల నిరీక్షణ..

- **క్యూలైన్‌లో తోపులాట**

**టి మీడియా, జూన్ 6 , కుభీర్:**
నిర్మల్ జిల్లా కుభీర్ మండల కేంద్రంలో జొన్నల కొనుగోళ్లకు టోకెన్ల జారీ ప్రక్రియ రసాభాసాగా మారింది. మూడు కౌంటర్లు ఏర్పాటు చేసిన టోకెన్లు ఇస్తుండగా రైతుల మధ్య తోపులాట జరిగింది. ఈ క్రమంలో మహిళ రైతులు కిందపడటంతో స్వల్పంగా గాయపడ్డారు.ఐకేపీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి నుంచి టోకెన్లు జారీ చేస్తుండటంతో శుక్రవారం రాత్రి నుంచే ఐకేపీ కార్యాలయానికి చేరుకుని రైతులు బారులు తీరారు. కార్యాలయ ఆవరణలో చీకటిలో బండరాళ్లు క్యూలో పెట్టి అక్కడే ఇరువైపులా పడుకున్నారు. నిద్రాహారాలు మాని అక్కడే టోకెన్ల కోసం నిరీక్షిస్తున్నారు. ఈ క్రమంలోనే శనివారం ఉదయం 9.30గంటల నుంచి సంబంధిత అధికారులు వచ్చి టోకెన్లు ఇవ్వడం మొదులపెట్టారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున రైతులు తరలిరావడంతో కౌంటర్ల వద్ద తోపులాట జరిగింది. ఈ క్రమంలో పలువురు రైతులు కిందపడి, స్వల్పంగా గాయపడ్డారు.పంట కొనుగోళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు



కేంద్రాల్లో క్వింటాల్‌కు మద్దతు ధర రూ.3700 కాగా, ప్రైవేటు వ్యాపారులు మాత్రం రూ.2200 ఇస్తున్నారని.. అందుకే టోకెన్ల కోసం ఇన్ని తిప్పలు పడాల్సి వస్తుందని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఇలాంటి కష్టం రాలేదని.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఉసురు పోసుకుంటుందని మండిపడ్డారు. రైతులు పండించిన ఉత్పత్తులను అమ్ముకునేందుకు ఇన్ని కష్టాలా అంటూ మహిళా రైతుల రేవంత్ సర్కార్‌ను తిడుతున్నారు.

# చెలరేగిపోతున్న ఇసుక మాఫియా

- **ఐక్యవేదిక అధ్యక్షుడు డాక్టర్ సతీష్ యాదవ్**

**టీ మీడియా, జూన్ 6, వనపర్తి బ్యూరో :**
వనపర్తి జిల్లాలో కంచే చేను మేస్తుందా? అవును అని నిరూపిస్తున్న ఇసుక మాఫియా వారికి తోడు ప్రజా ప్రతినిధులు అధికారులు. జిల్లా ప్రజావాణి ఆ తర్వాత సీఎం ప్రజావాణికి ఫిర్యాదు చేసినా ఒక్క ట్రాక్టర్ కూడా ఆపలేని పరిస్థితి. కోట్ల రూపాయల మట్టి మాయం. కాదు కాదు గుట్టలే మాయం. వనపర్తి జిల్లాలో ఎక్కడ చూసినా గుట్టలు, చెరువులు తొవ్వేస్తున్న షాడోలు. ఇకనైనా ఆపి చర్యలు తీసుకోమని పలు సంఘాలు ప్రజలు కోరిన నిమ్మకు నీరెత్తినట్టున్న అధికారులు ప్రజాప్రతినిధులు. వారి అనుచరులే త్రవ్వేస్తున్నందున అండగా ఉంటున్నారని బాహాటంగా చర్చించుకుంటున్న ప్రజలు. పక్కృతికే రక్షణ లేకుంటే ప్రజలకు ఎలా లక్ష్యం ఉంటుందని ప్రశ్నించే వారిపై ఎదురు దాడి. పంచాయతీ పెద్దల బెదిరింపులు ఇది ఎప్పుడు



మారుతుందని బడా అధికారులకు, బడా ప్రజాప్రతినిధులకు అఖిలపక్ష ఐక్యవేదిక ప్రశ్న? సేవ్ వనపర్తి కాదు కాదు షేవ్ వనపర్తి గా మారుతుంది. ఇప్పటి వరకు రెండు కోట్ల రూపాయల మట్టి మాయం.. మరి ప్రభుత్వానికి రాయల్టీ ఎంత వచ్చింది. దీనిపై సంబంధిత అధికారులు ప్రజలకు సమాధానం చెప్పాలి , లేకుంటే వారిని బాధ్యులు చేయాలని కోరుతున్న ప్రజలు. ఈ అంశాన్ని శినివారం పరిశీలించిన అఖిలపక్ష ఐక్యవేదిక వేదిక నాయకులు. అటవీ ప్రాంతంలో ఉండే గుట్టలకు రాయల్టీ కట్టినా మట్టి ఇవ్వకూడదని సుప్రీంకోర్టు తీర్పు నిర్వీర్యం చేస్తున్న అధికారులు నాయకులు. సీఎం ప్రజావాణి లో ఫిర్యాదు చేసిన ఇప్పటివరకు ఎలాంటి చర్యలు లేకుంటే ఎవరిపై అనుమానం పెట్టుకోవాలి ప్రజలు చర్చించు కుంటున్నారు. వెంటనే మట్టి, చెరువుల మట్టి తీయడం ఆపాలని, పకృతిని కాపాడాలని, పర్యావరణ దినం రోజున ఏదో ఒక మొక్క నాటి ఫోటోలు దిగడం కాదు దీనిపై చర్య తీసుకోవాలని అఖిలపక్ష అఖిలపక్ష డిమాండ్ చేస్తుంది. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు డాక్టర్ సతీష్ యాదవ్, వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు కొత్త గొల్ల శంకర్, బీఎస్పీ నాయకులు మైబూస్, లోక్సత్తా నాయకులు రాజ్ కుమార్, బిజెపి నాయకులు రవి, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## అండర్-16 క్రికెట్ మ్యాచ్

**టీ మీడియా, జూన్ 6 పెబ్బేరు:**
పెబ్బేరు పట్టణంలో మహబూబ్‌నగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి రాజశేఖర్ ఆధ్వర్యంలో పెబ్బేరులో నిర్వహించిన అండర్-16 అంతర్ జిల్లా క్రికెట్ మ్యాచ్‌లో వనపర్తి జిల్లా పెబ్బేరు జట్టు అద్భుత విజయం సాధించింది వనపర్తి జిల్లా పెబ్బేరు జట్టు నాగర్‌కర్నూల్ జిల్లా జట్ల మధ్య జరిగిన ఈ మ్యాచ్‌కు పెబ్బేరు పట్టణ ఎస్సై ముఖ్య అతిథిగా హాజరై టాస్ వేశారు.టాస్ గెలిచిన వనపర్తి జిల్లా పెబ్బేరు జట్టు ముందుగా బ్యాటింగ్ ఎంచుకుని 29.2 ఓవర్లలో 196 పరుగులకు ఆలౌట్ అయింది జట్టు తరపున చరణ్ అద్భుతంగా ఆడి 64 పరుగులు సాధించాడు నాగర్‌కర్నూల్ బౌలర్లలో హర్ష నాలుగు వికెట్లు తీసి ఆకట్టుకున్నాడు.రణ్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది ఈ అవార్డును సత్యం రెడ్డి శేఖర్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. మ్యాచ్‌కు క్రీడాభిమానులు కోచ్‌లు క్రీడాకారుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై ఆటగాళ్లను ప్రోత్సహించారు ఈ కార్యక్రమంలో మహబూబ్ నగర్ అసోసియేషన్ సభ్యులు శంకర్ క్రికెట్ అసోసియేషన్ సభ్యులు పి ఆర్టి యు మండల అధ్యక్షులు చిన్న రాములు క్రీడాభిమానులు పాల్గొన్నారు.



## సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

- **అఖిల భారతీయ విద్యార్థి పరిషత్**

**టీ మీడియా, జూన్ 6, వనపర్తి బ్యూరో :**
అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) వనపర్తి జిల్లా ఆధ్వర్యంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కి జూనియర్ కళాశాలల సమస్యలపై వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వనపర్తి జిల్లా కన్వీనర్ దేవర్ల కార్తీక్ మాట్లాడుతూ, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కనీస మౌలిక వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సరిపడా తరగతి గదులు, తాగునీరు, మరుగుదొడ్లు, ల్యాబ్ సదుపాయాలు లేక విద్యార్థుల విద్యాభ్యాసం దెబ్బతింటోందన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థుల కోసం కళాశాలలకు అందుబాటులో హాస్టల్ వసతి కల్పించాలని ఏబీవీపీ డిమాండ్ చేస్తోందన్నారు. అలాగే ఖాళీగా ఉన్న బోధన సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేసి నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని, అధిక ఫీజుల వసూళ్లను అరికట్టి విద్యార్థుల హక్కులను పరిరక్షించాలని ఏబీవీపీ డిమాండ్ చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో శివాజీ జోనల్ ఇరార్జి నితిన్ ,చందు తదితరులు పాల్గొనారు.




## కాలిపోయిన ఎన్టీఆర్ విగ్రహం..

**టి మీడియా, జూన్ 6 , నల్లగొండ :**
నల్గొండ పట్టణంలో అపశృతి నెలకొంది. ఎన్టీఆర్ చౌరస్తాలోని విగ్రహానికి మంటలు అంటుకోవడంతో కాలిపోయింది. ఈ విషయాన్ని శనివారం ఉదయం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని మంటలను ఆర్పివేశారు అనంతరం మున్సిపల్ సిబ్బంది ఎన్టీఆర్ విగ్రహాన్ని శుభ్రపరిచే పనులు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.విగ్రహానికి ఎవరైనా కావాలనే నిప్పంటించారా? లేదా షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలోనే సమీపంలోని సీసీటీవీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



## చదివింది పది.. చేసేది లింగ నిర్ధారణ

**టి మీడియా, జూన్ 6 , చిత్తూరు :**
కడుపులో ఉన్నది ఆడపిల్లో, మగపిల్లాడో తేల్చే లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని నెత్తీనోరూ బాదుకుంటున్నా.. కొందరు కాసుల కక్కుర్తి కోసం ఈ ఘాతుకాలకు ఒడిగడుతూనే ఉన్నారు. విస్తుపోయే విషయమేంటంటే.. ఈ దందా నడుపుతున్న నిర్వాహకులు చదివింది కేవలం పదో తరగతి లేదా అంతకంటే తక్కువే! గతంలో స్కానింగ్ సెంటర్లలో పనిచేసిన అనుభవంతో పాత మిషన్లను కొనుగోలు చేసి ఈ ముఠాలు అక్రమ వ్యాపారానికి తెరలేపాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లా కేంద్రంగా సాగుతున్న ఈ దందా ఆంధ్రప్రదేశ్‌తో పాటు తమిళనాడు, కర్ణాటక వరకు విస్తరించింది. ఆర్ఎంపీలు, ల్యాబ్ నిర్వాహకులు, ఆటో డ్రైవర్ల ద్వారా గర్భిణులను రప్పిస్తున్నారు. చిత్తూరు భరత్‌నగర్‌లో గతంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన దాడుల్లో ఒకేచోట 11 మంది పరీక్షలకోసం వచ్చిన గర్భిణులు దొరకడం ఈ నెట్‌వర్క్ తీవ్రతకు అద్దం పడుతోంది. లింగ నిర్ధారణ పరీక్ష కోసం ఒక్కొక్కరి నుండి రూ. 8 వేల నుండి రూ. 10 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఒకవేళ కడుపులో ఉన్నది ఆడపిల్ల అని తేలితే.. వైద్య శిబిరం తరహాలో వారం లేదా 15 రోజులకోసారి నిర్వహిస్తున్నారు. నిపుణులైన వైద్యుల ప్రమేయం లేకుండానే అబార్షన్ కిట్లు ఇచ్చి గర్భస్రావాలు చేయిస్తున్నారు. ఈ గర్భవిచ్ఛిత్తి కోసం రూ. 20 వేల నుండి రూ. 50 వేల వరకు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి నకిలీల చేతిలో పడి తరచూ గర్భిణుల ప్రాణాలు సైతం ప్రమాదంలో పడుతున్నాయి



## ఓపెన్‌కు 1000-పానాకు 1300

### జస్ట్ నంబర్ చెప్తే రాత్రికి రాత్రే లక్షాధికారులు

**టి మీడియా, జూన్ 6 , హైదరాబాద్ బ్యూరో :**
నిషేధిత మట్కా ఆడాలంటే ఓ చీకటిమాటు ఏజెంట్? కోసం వెతకాలి. చీటీలను రాయించుకోవాలి. ఇదంతా నిన్న మొన్నటి పరిస్థితి. కానీ కాలంతో పాటు ట్రెండ్ కూడా మారింది. సెల్?ఫోన్ వేదికగా జూదం ఆడేస్తున్నారు. మహారాష్ట్ర కేంద్రంగా నడిచే ఈ మాయజాలం ఆన్?లైన్ మాధ్యమంగా తెలంగాణ-కర్ణాటక రాష్ట్ర సరిహద్దుల్లోని జహీరాబాద్ డివిజన్లలో జోరుగా సాగుతోంది. తక్కువ పెట్టుబడితో రాత్రికి రాత్రే లక్షాధికారులు కావొచ్చని సామాన్యులకు ఎరగా వేస్తున్నారు.

**ఆఫ్?లైన్ టు ఆన్?లైన్**
బాంబే మిలన్, కల్యాణ్, రాజధాని, శ్రీదేవి, టైం ఈ పేర్లన్నీ నిర్వాహకులు అడ్డదారిలో సంపాదనకు పెట్టిన పేర్లు. గతంలో ఆఫ్?లైన్?లో సాగిన ఈ జూదం ఇప్పుడు ఆన్?లైన్ బాట పట్టింది. 'ఓపెన్, క్లోజ్, జాయింట్, పానా' అంటూ సాగే ఈ గేమ్?లో ఇప్పుడు వాట్సాప్? గ్రూప్?లే కీలకంగా మారాయి. రూపాయికి రూ.100, రూ.10 పెడితే రూ.1000 వస్తాయంటూ ఆశ పెడుతున్నారు. 0-9 అంకెలు ఎంచుకుని స్మార్ట్?ఫోన్?లోనే పందేలు కాస్తున్నారు.

**అంతంతమాత్రంగానే చర్యలు**
ఉన్నతాధికారులు ఆదేశిస్తేనే పోలీసులు దాడి చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. న్యాల్‌కల్, కోహీర్, జహీరాబాద్ పోలీసులు సహా రూరల్ సర్కిల్ అధికారి నిర్వాహకులతో ములాఖత్ అయినట్లు ప్రచారం. ఇటీవల కోహీర్ పోలీసుల దాడి సమాచారం తెలుసుకున్న నిర్వాహకులు రికార్డులను బావిలో పడేశారు. వాటిని తీసే క్రమంలో ఓ ఏజెంట్ ప్రాణాలను కోల్పోవడం ఈ దందా తీవ్రతకు అద్దం పడుతోంది.

**రూ.లక్షల్లో దందా**
మహారాష్ట్రలో అధికారంగా సాగే ఈ గేమ్?కు నిర్వాహకులు, రాష్ట్ర సరిహద్దులోని జహీరాబాద్, న్యాల్‌కల్, పటాన్‌చెరు, కోహీర్ ప్రాంతాలను అడ్డాగా చేసుకున్నారు. న్యాల్‌కల్ మండలం రాజోల, కల్‌బెమల్, గంగ్వార్ తదితర పల్లెల్లోని స్థానికులతో కలిసి బీదర్ ఏజెంట్లతో కలిసి రోజూ రూ.లక్షల్లో దందాను సాగిస్తున్నారన్నది ఓపెన్ సీక్రెట్. పూటకో పేరుతో ఆన్‌లైన్ లింకులను, నంబర్లను వదులుతూ పందెం రాయుళ్లను ఆకర్షిస్తున్నారు. కూలీలు, చిరు వ్యాపారులు, ఆటో డ్రైవర్లు, ఒప్పంద ఉద్యోగులే అధికంగా ఆడుతున్నారు. కొన్ని సందర్భాల్లో స్థలాలు, ఆభరణాలు సైతం తాకట్టు పెడుతున్నారంటే మట్కా మహమ్మారి తీవ్రత ఎంతగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

**అసలేంటీ మట్కా?**



| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| सोम | 2 | 688 26 | 6 | 880 62 | 8 | 189 89 | 9 | 126 98 |
| मंगल | 0 | 488 04 | 4 | 400 40 | 7 | 557 78 | 8 | 468 87 |
| बुध | 6 | 600 67 | 7 | 250 76 | 8 | 800 89 | 9 | 199 98 |
| गुरु | 3 | 788 35 | 5 | 140 53 | 7 | 566 78 | 8 | 800 87 |
| शुक्र | 1 | 588 17 | 7 | 269 71 | 8 | 125 89 | 9 | 388 98 |

ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి ఇలా నాలుగుసార్లు ఒక్కో నెంబర్ చొప్పున విడుదల చేస్తారు. ఈ నెంబర్ ఏంటని ముందుగా అంచనా వేసి చెప్పి పందెం కాయడమే మట్కా. 0-9 వరకు ఏదో ఒక అంకెను ఎంచుకుని ఓపెన్, క్లోజ్, బ్రాకెట్‌గా కేటాయించుకుని ఈ ఆటను ఆడుతుంటారు. ఓపెన్‌కు రూ.100కు రూ.1000, క్లోజ్‌కు రూ.100కు రూ.1000, బ్రాకెట్‌కు రూ.10కి రూ.1000, పానాకు రూ.10కి రూ.1300 నగదు చెల్లిస్తుంటారు. ఇలాంటి వాటి వల్ల ప్రజలు తాము కష్టపడి సంపాదించుకున్న డబ్బును పోగొట్టుకుంటున్నారు.

**అడ్డాల్లో అడ్డగోలుగా**
ఆఫ్‌లైన్ విధానంలోనూ ఈ దందా జోరుగా కొనసాగుతోంది. పలువురు ఏజెంట్లుగా వ్యవహరిస్తూ ఆడే వారి నుంచి ఫోన్ నంబర్లు, నగదు సేకరిస్తున్నారు. ప్రధానంగా కాగజ్‌నగర్ టౌన్?లోని గాంధీ చౌక్, రైల్వేస్టేషన్ రోడ్డు, సర్‌సిల్క్, ఎస్‌బీఐ బ్యాంకు వెనుక తదితర ప్రదేశాల్లో ఆడుతున్నట్లుగా సమాచారం. ఏజెంట్లుగా వ్యవహరిస్తున్న వారు రూ.లక్షల్లో వెనకేసుకుంటున్నట్లుగా తెలుస్తోంది. పోలీసులు జూదం ఆడుతున్న వారిని అప్పుడప్పుడూ పట్టుకుంటున్నప్పటికీ నిర్వాహకులు మాత్రం తమ కార్యకలాపాలను మాత్రం కొనసాగిస్తూనే ఉన్నారు.

## మైనర్ పాస్‌పోర్ట్ దరఖాస్తుకు తల్లిదండ్రులిద్దరి సంతకాలు అవసరం లేదు: హైకోర్టు

**టి మీడియా, జూన్ 6 , అమరావతి బ్యూరో**
వైవాహిక వివాదాల కారణంగా భార్యాభర్తలు వేర్వేరుగా జీవిస్తున్నప్పుడు మైనర్ పిల్లలకు పాస్‌పోర్ట్ కోసం చేసే దరఖాస్తులో తల్లిదండ్రుల ఇద్దరి సంతకాలు అవసరం లేదని హైకోర్టు స్పష్టంచేసింది. ఎవరో ఒకరు (సింగిల్ పేరెంట్) దరఖాస్తు చేయడానికి అర్హులేనని తేల్చి చెప్పింది. మైనర్ కుమార్తెకు పాస్‌పోర్ట్ జారీ చేయాలంటే భర్త నుంచి విడాకులు తీసుకున్నట్లు లేదా కోర్టు ఆదేశాలతో వేర్వేరుగా జీవిస్తున్నట్లు పత్రాలు తీసుకురావాలంటూ ఓ ఒంటరి మహిళను పోస్‌పోర్ట్ అధికారులు కోరడాన్ని ధర్మాసనం తప్పు పట్టింది.దంపతుల మధ్య విడాకుల ప్రక్రియ పెండింగ్‌లో ఉన్నప్పుడు పిల్లల సంరక్షణ చూస్తున్న తల్లి ఇచ్చే డిక్లరేషన్ ఆధారంగా మైనర్లకు పాస్‌పోర్ట్? జారీ చేయవచ్చని తెలిపింది. 2 వారాల్లో బాలికకు పాస్‌పోర్ట్ జారీ చేయాలని అధికారులను ధర్మాసనం ఆదేశించింది. ఓ ఒంటరి తల్లికి ఊరటనిస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ ఇటీవల ఈమేరకు తీర్పు ఇచ్చారు.




**ఇది "వ్యక్తిగత స్వేచ్ఛ"లో భాగం**
రాజ్యాంగలోని అధికరణ 21 ప్రకారం విదేశాలకు వెళ్లే హక్కు 'వ్యక్తిగత స్వేచ్ఛ'లో భాగం. చట్టపరమైన అడ్డంకులు లేనప్పుడు ఆ హక్కును నిరాకరించడానికి వీల్లేదు' అని ఆయా తీర్పులు స్పష్టం చేస్తున్నాయని జస్టిస్ దేవానంద్ గుర్తు చేశారు. తన 4 ఏళ్ల కుమార్తెకు పాస్‌పోర్ట్? కోసం చేసిన దరఖాస్తుపై విజయవాడ పాస్‌పోర్ట్ అధికారులు చర్యలు తీసుకోవట్లేదని శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన షేక్ షాబానా హైకోర్టును ఆశ్రయించారు.భర్త వరకట్న వేధింపుల కారణంగా వేరుగా జీవిస్తున్నానన్నారు. ఈ వ్యవహారమై నమోదైన 2 కేసుల విచారణ కోర్టులలో పెండింగ్?లో ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో తన భర్త సంతకం లేకుండా ఎందుకు దరఖాస్తు చేయాల్సి వచ్చిందో వివరిస్తూ డిక్లరేషన్' ఇచ్చానని ఆమె కోర్టుకు తెలిపారు. వాదనలు విన్న న్యాయమూర్తి పిటిషనర్ ఇప్పటికే డిక్లరేషన్ ఫారాలు ఇచ్చినందున బాలికకు పాస్‌పోర్ట్ జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.
గతంలోనూ ఇలాంటి వివాదం ఇదే మొదటిది కాదని న్యాయమూర్తి అన్నారు. ఈ వ్యవహారంపై గతంలో వివిధ హైకోర్టులు తీర్పులిచ్చాయని గుర్తు చేశారు. వైవాహిక వివాదాలు నడుస్తున్నప్పుడు అవతలి భాగస్వామి సంతకం చేయకపోయినప్పటికీ పాస్‌పోర్ట్ నిబంధనలకు అనుగుణంగా డిక్లరేషన్ ఫారం ఇస్తూ మైనర్ పిల్లల పాస్‌పోర్ట్ కోసం సింగిల్ పేరెంట్ దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. ప్రస్తుత వ్యవహారంలో పిటిషనర్ ఇప్పటికే డిక్లరేషన్ ఫారాలు ఇచ్చారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో బాలికకు పాస్‌పోర్ట్ జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. వైవాహిక వివాదాలు నడుస్తున్నప్పుడు మైనర్లకు పాస్‌పోర్ట్? జారీచేసే విషయంలో మధ్యప్రదేశ్, ముంబై, తెలంగాణ, మద్రాస్ హైకోర్టులు స్పష్టతనిస్తూ గతంలోనే తీర్పులిచ్చాయి.

## ఏసీబీ వలలో వక్ఫ్‌బోర్డ్ ఇన్‌స్పెక్టర్..

**టి మీడియా, జూన్ 6 , నల్లగొండ:**
నల్లగొండలోని వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ ఏసీబీకి చిక్కాడు. మిర్యాలగూడలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ వ్యక్తిని నుంచి రూ.10వేలు లంచం తీసుకుంటుండగా వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ మహమూదద్‌ను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మహమూద్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. మిర్యాలగూడ పట్టణంలోని మందులవారి కాలనీలో ఉన్న అతని నివాసంలోనూ సోదాలు చేపట్టారు. అలాగే నల్లగొండలోని నివాసంలోనూ ఏసీబీ బృందం తనిఖీలు చేపట్టింది.




## కో-అప్షన్ సభ్యునిగా మిట్టపల్లి పొలు నామినేషన్

**టీ మీడియా, జూన్ 6, రామకృష్ణాపూర్:**
క్యాతనపల్లి మున్సిపాలిటీ సిపిఐ పార్టీ నుండి మైనార్టీ కోటలో కో-ఆప్షన్ సభ్యునిగా శనివారం మిట్టపల్లి పౌలు పుర కార్యాలయంలో నామినేషన్ వేయడం జరిగింది. ఈ నామినేషన్ లో వైస్ చైర్ పర్సన్ మిట్టపల్లి సరిత ,శ్రీనివాస్,కౌన్సిలర్స్ కొడగాని సాంబయ్య,మద్దెల శంకర్,మామిడి గోపి,ఎగూడ మొండి,పార్టీ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



## లిక్కర్ ఫ్యాక్టరీ జల దోపిడీ

- **పొలిటికల్ జె ఏ సి చైర్మెన్**

**టీ మీడియా, జూన్ 6, పెబ్బేరు:**
పెబ్బేరు మండలంలోని రంగాపూర్ గ్రామ శివారులో గల ఎబిడి లిక్కర్ ఫ్యాక్టరీ సమీపంలోని కృష్ణానది పరివాహక ప్రాంతాన్ని బీసీ పొలిటికల్ జేఏసీ నాయకులు పరిశీలించారు ఈ సందర్భంగా రాచాల మీడియాతో మాట్లాడుతూ ఎబిడి లిక్కర్ ఫ్యాక్టరీ అక్రమ నీటి వాడకంపై గత కొన్ని నెలలుగా బీసీ పొలిటికల్ జేఏసీకి ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు రావడం జరిగిందన్నారు ఎలాంటి అనుమతులు లేకుండా కృష్ణానది నీటిని అక్రమంగా వాడుకుంటున్నారని అదేవిధంగా ఫ్యాక్టరీ నుంచి వెలువడే వ్యర్థాలను కృష్ణా నదిలో కలుపుతున్నట్లు కూడా మా దృష్టికి వచ్చిందన్నారు .వే ప్రజలు తాగునీటికీ రైతులు వ్యవసాయానికి నీరు లేక అల్లాడుతున్నారని లిక్కర్ ఫ్యాక్టరీ యాజమాన్యం మాత్రం దర్జాగా జలదోపిడి చేస్తుందని విమర్శించారు. పట్టపగలు ఇంత జలదోపిడి జరుగుతున్న పట్టించుకోని ఇరిగేషన్ శాఖ అధికారులు ఎందుకోసం మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి వెంటనే స్పందించి కృష్ణానది జలాల అక్రమ తరలింపుపై సమగ్ర విచారణకు ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు ఫ్యాక్టరీ వ్యర్థాలతో కలుషితమవుతున్న కృష్ణానది నీటి వల్ల జీవరాసులు సైతం మృతి చెందుతున్నాయని ఈ సమస్యపై చెన్నై లోని గ్రీన్ ట్రిబ్యునల్ కు ఫిర్యాదు చేసి జలదోపిడిని అడ్డుకుంటామని అన్నారు ఈ కార్యక్రమంలో పొలిటికల్ జెఎసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మహేందర్ నాయుడు రాష్ట్ర కార్యదర్శి వివి గౌడ్ నాయకులు దేవర శివ బత్తుల జితేందర్ రామన్ గౌడ్ బీచుపల్లి సర్పంచ్ బీసిరెడ్డి ఉప సర్పంచ్ నాగరాజు ఆదామ్ రాజశేఖర్ గౌడ్ వీరేష్ నరేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# సినిమా స్టోరీని మించిన స్క్రిప్ట్

- కట్టుకున్నోడిని బలిచ్చిన ఆలి!

**టి మీడియా, జూన్ 6 , నల్గొండ :**

రోడ్డు పక్కనే గోతిలో బైక్ పడిపోయింది. ఆ పక్కనే ఓ పెద్దాయన రాళ్లపై పడి కన్నుమూశాడు. చీకటిలో దారి తెలియక బైక్ పైనుంచి కింద పడిపోయి చనిపోయాడేమో అనుకున్నారు అందరూ. పోలీసులు సైతం అదే భావించారు. కానీ చనిపోయిన వ్యక్తి పడిపోయిన విధానం గానీ, బైక్ పడిన తీరు గానీ గమనిస్తే కచ్చితంగా ఇది ప్రమాదం కాదని అర్థమవుతుంది. పోలీసులు సైతం అదే అనుమానించారు. వారు అనుకున్నట్లే పోస్టుమార్టం రిపోర్టులో ఆ వ్యక్తి రోడ్డు ప్రమాదం వల్ల చనిపోలేదని, ఎవరో గొంతు నులిమి హత్య చేశారని తేలడంతో పోలీసులే ఆశ్చర్యపోయారు. విచారణలో వారికి అంతకు మించిన షాకింగ్ విషయాలు తెలిశాయి. ఇంతకీ ఆ వ్యక్తిని హత్య చేసిందెవరు? పోలీసుల విచారణలో తేలిన షాకింగ్ నిజాలు ఏంటి?

**పెళ్లైన రెండు దశాబ్దాలకు తప్పటడుగులు**

పెళ్లైన కొత్తలో తెలిసీతెలియక తప్పులు చేశారంటే సహజం. వయసులో ఉన్నప్పుడు పొరపాట్లు చేయడం మానవ నైజం. కానీ పెళ్లైన రెండు దశాబ్దాల తర్వాత కూడా వివాహితలు తప్పటడుగులు వేస్తున్నారు. అనైతిక బంధాల కోసం అయిన వారిని సైతం అంతమొందిస్తున్నారు. ప్రియుడిపై ఉన్న మోజుతో కట్టుకున్న భర్తను సైతం కడతేర్చడానికి వెనకాడటం లేదు. పైగా హత్యకు సినిమా స్టోరీలను మించి పక్కా ప్రణాళికతో పథకాన్ని అమలు పరుస్తున్నారు. వారి వ్యూహాలు చూసి పోలీసులు సైతం ఆశ్చర్యపోతున్నారు. నల్గొండ జిల్లాలోనూ సరిగ్గా ఇలాంటి ఘటనే చోటుచేసుకుంది. సోదరి, ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన భార్య,



దాన్ని రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించి పోలీసులను సైతం తప్పుదోవ పట్టించింది.

**పోస్టుమార్టం రిపోర్ట్? ఆధారంగా**

నల్గొండ జిల్లా చందంపేట మండలం తెల్దేవరపల్లి మార్గంలో రోడ్డుపక్కన పడి ఓ వ్యక్తి చనిపోవడాన్ని చూసి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. రోడ్డుపక్కనే చిన్న గోతిలో రాళ్ల కుప్పపై పడి వ్యక్తి చనిపోగా, ఆ పక్కనే అతని బైక్ పడి ఉంది. చనిపోయిన వ్యక్తి చందంపేట మండలం బిల్డింగ్ తండాకు చెందిన నరసింహగా పోలీసులు గుర్తించారు. బైక్‌పై వస్తూ ప్రమాదవశాత్తు రోడ్డు పక్కన పడిపోయి చనిపోయి ఉంటాడని అందరూ భావించారు. పోస్టుమార్టంలో అతన్ని హత్య చేసి చంపారని తేలడంతో పోలీసులు లోతుగా దర్యాప్తు చేపట్టారు. ప్రియుడు రాజుతో కలిసి నరసింహ భార్య జ్యోతి గొంతు నులిమి హత్య చేసిందని తేలింది. వీరికి జ్యోతి అక్క రమావత్ లక్ష్మి సహకారం అదించింది.

**పొలం దున్నడానికి వచ్చి**

బిల్డింగ్ తండాకు చెందిన రమావత్ నరసింహ మొదటి భార్య చనిపోవడంతో జ్యోతిని దాదాపు రెండు దశాబ్దాల క్రితమే రెండో వివాహం చేసుకున్నాడు. అప్పటి నుంచి భార్యాభర్తలిద్దరూ బాగానే ఉన్నారు. అయితే మద్యం తాగే అలవాటు ఉన్న నరసింహ, జ్యోతిని డబ్బుల కోసం బాగా ఇబ్బంది పెట్టేవాడు. నాగర్‌కర్నూలు జిల్లాలో ఉండే జ్యోతి అక్క రమావత్ లక్ష్మి ఇంటి పక్కనే రాజు అనే ట్రాక్టర్ డ్రైవర్ ఉండేవాడు. అప్పుడప్పుడు పొలం దున్నడానికి బిల్డింగ్ తండాకు సైతం రాజు వచ్చేవాడు. ఆ క్రమంలో నరసింహ భార్య జ్యోతితో రాజుకు వివాహేతర సంబంధం ఏర్పడింది. దీంతో వీరిద్దరూ కలిసి నరసింహ అడ్డు తొలగించుకోవాలని పథకం వేశారు. వీరికి జ్యోతి అక్క లక్ష్మి కూడా సహకారం అందిస్తానంది. డబ్బులిప్పిస్తానని చెప్పి భర్తను జ్యోతి బైక్‌పై తెల్దేవరపల్లి రోడ్డుకు తీసుకెళ్లింది. రాజు, లక్ష్మి కూడా అక్కడికి చేరుకున్నారు. అందరూ కలిసి నరసింహకు ఫుల్‌గా మద్యం తాగించి గొంతు నులిమి చంపేశారు.

**తండ్రి మృతిపై కుమారుడి అనుమానంతో**

నరసింహను హత్య చేసి ముగ్గురు కలిసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించారు. మృతదేహాన్ని రోడ్డుపక్కనే పడేసి ఆ పక్కనే అతడి బైక్ పడేశారు. నరసింహపై గతంలో బ్యాటరీల దొంగతనం కేసు ఉండటంతో రాజు తన ట్రాక్టర్ బ్యాటరీ తీసుకొచ్చి అక్కడ పడేశాడు. బ్యాటరీ దొంగతనం చేసి వస్తూ హడావుడిలో కిందపడిపోయాడని అందరినీ నమ్మించేలా పక్కా పథకం రచించారు. కానీ నరసింహ మొదటి భార్య కుమారుడు తండ్రి మృతిపై అనుమానం వ్యక్తం చేయడంతో పోలీసులు లోతుగా విచారణ చేశారు. సాంకేతిక ఆధారాల సాయంతో నిందితులను పట్టుకున్నారు.

**ప్రియుడి కోసం భర్తనే హత్య చేసి**

ఎక్కడైనా నమ్మకం బంధాన్ని నిలబెడుతుంది కానీ అదే నమ్మకం ద్రోహంగా మారితే ప్రాణాలను బలి తీసుకుంటుంది అనడానికి నరసింహ హత్య ఉదాహరణ. 20 ఏళ్ల పాటు కాపురం చేసిన భర్తనే ప్రియుడి కోసం హత్య చేసిన జ్యోతి కటకటాలపాలైంది.

## పుష్కర ఘాట్‌కు సీఎం చంద్రబాబు మనవడి పేరు.!

**టి మీడియా, జూన్ 6, తూర్పుగోదావరి**




తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గంలోని సీతానగరం మండలం మునికూడలి పుష్కర ఘాట్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మనవడు, మంత్రి నారా లోకేష్ కుమారుడైన నారా దేవాన్ష్ పేరు పెట్టాలనే ప్రతిపాదనపై రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు సుమారు కోటి రూపాయల వ్యయంతో ఈ ఘాట్‌ను ఆదర్శ ఘాట్‌గా తీర్చిదిద్దే పనులు ప్రారంభమయ్యాయని, దీనికి దేవాన్ష్ ఘాట్ అని నామకరణం చేస్తున్నట్లు స్థానిక జనసేన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఇటీవల వెల్లడించారు. అయితే స్థానిక నాయకులు, కూటమి కార్యకర్తలు ఎంతో ఉత్సాహంతో, అభిమానంతో ఈ పేరును ప్రతిపాదించినప్పటికీ, ఈ ఉదంతం సామాజిక మాధ్యమాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. దీంతో ఈ విషయం కాస్తా మంత్రి నారా లోకేష్ దృష్టికి వెళ్లడంతో ఆయన తక్షణమే స్పందించి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఘాట్లకు లేదా ప్రజా ఆస్తులకు తన కుమారుడు దేవాన్ష్ పేరు పెట్టడం హాస్యాస్పదమని, అలాంటి పనులను తాను అస్సలు ప్రోత్సహించనని స్పష్టం చేశారు. దేవాన్ష్ పేరు మీద ఎలాంటి ఘాట్లకు నామకరణం చేయకూడదని ఇప్పటికే అధికారులకు, స్థానిక నాయకులకు కరాఖండిగా ఆదేశాలు జారీ చేశానని ఆయన సామాజిక మాధ్యమాల ద్వారా వెల్లడించారు. ఈ విషయాన్ని తన దృష్టికి తీసుకొచ్చిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేస్తూ, ప్రజా ఆస్తుల విషయంలో ఇలాంటి కొత్త సంస్కృతికి తావులేదని నారా లోకేష్ ఈ వివాదానికి ముగింపు పలికారు.



## దళిత క్రైస్తవులకు నమ్మక ద్రోహం చేసిన కాంగ్రెస్

**టీ మీడియా, జూన్ 6, వనపర్తి బ్యూరో :**

1950 రాష్ట్రపతి ఉత్తర్వులు దళితుల మెడ మీద కత్తిలాగా వేలాడుతున్నాయని , ఈ ఉత్తర్వులు రద్దు చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ వనపర్తి జిల్లా కమిటీ డిమాండ్ చేశారు. శినివారం వనపర్తి జిల్లా కేంద్రంలో హెబ్రోన్ చర్చిలో దళిత క్రైస్తవులు రాజ్యాంగ హక్కులు సామాజిక హోదా అనే అంశం మీద మహాసభను నిర్వహించడం జరిగింది. ఈ సభకు ఎన్సిజేఏసీకెపి ఐజాక్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కొమ్ము చెన్నకేశవులు మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా అనుబంధ సంఘాల సమన్వయకర్త గంధం గట్టయ్య మాదిగ, సామాజిక కార్యకర్త గంధం నాగరాజు మాదిగ మాట్లాడుతూ ఈ దేశంలోకి క్రైస్తవం ఇస్లాం రాకముందు ఏ విధమైనటువంటి కులవ్యక్షత ఉన్నదో ఆ వివక్షత నేటికీ అనేక రూపాల్లో కొనసాగుతుందని అన్నారు. క్రైస్తవ మతంలోకి వెళ్లిన బ్రాహ్మణ, రెడ్డి, కమ్మ, వైశ్య ఇతర అగ్రకులాల సామాజిక హోదా మారనప్పుడు కేవలం దళితుల హోదా మాత్రమే ఎందుకు మారుతుందని ప్రశ్నించారు. కాంగ్రెస్ చేసిన మోసాలను ఇకనైనా దళిత క్రైస్తవ సమాజం అర్థం చేసుకోవాలని అన్నారు. శక్తివంతమైన ఉద్యమాన్ని నడిపి మరింత ప్రజా మద్దతును సమీకరించి పోరాటాన్ని ఉదృతం చేద్దామని అందుకు దళిత క్రైస్తవులు అందరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో, దేశంలో దళిత పాస్టర్ల మీద జరుగుతున్న దాడులను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. దళిత క్రైస్తవుల మీద దాడులు చేస్తే ఇక సహించేది ఉండదని స్పష్టం చేశారు.

కార్యక్రమంలో దళిత క్రైస్తవులు , పాస్టర్లు , ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కే కేశవులు మాదిగ,ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసాల నాగరాజు మాదిగ , ఆర్ శాస్త్రి, చంద్రశేఖర్, విజయ్, లీగల్ అడ్వైజర్ కొమ్ము వెంకటేష్,పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## హైదరాబాద్‌లో అక్రమ ఫార్మా నెట్‌వర్క్

- కీలక పత్రాలు, డ్రగ్ సీజ్!

**టి మీడియా, జూన్ 6 , హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ కూకట్‌పల్లిలో అక్రమంగా నిర్వహిస్తున్న యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రిడియెంట్స్ వ్యాపారంపై భారీ దాడి నిర్వహించింది. ఎక్సైజ్ శాఖతో కలిసి చేపట్టిన సంయుక్త ఆపరేషన్‌లో లైసెన్స్ లేకుండా యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రిడియెంట్స్ ల కొనుగోలు, విక్రయాలు జరుగుతున్న నెట్‌వర్క్‌ను అధికారులు గుర్తించారు. కూకట్‌పల్లి ప్రశాంతి నగర్ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రిడియెంట్స్ కాంప్లెక్స్‌లో సైనిక్స్ ల్యాబ్స్ పేరుతో కార్యకలాపాలు నిర్వహిస్తున్న సంస్థపై అధికారులు దాడి చేశారు. తనిఖీల్లో డ్రగ్ లైసెన్స్ లేకుండానే యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రిడియెంట్స్ ల వ్యాపారం సాగిస్తున్నట్లు తేలడంతో సంస్థపై కేసు నమోదు చేశారు. దాడి సందర్భంగా సంస్థ యజమాని గాడె రామకృష్ణ రెడ్డి వద్ద నుంచి 170 గ్రాముల జిడోవుడిన్ అనే యాంటీవైరల్ ఔషధాన్ని స్వాధీనం చేసుకున్నారు. అలాగే వివిధయాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రిడియెంట్స్ ల కొనుగోలు, విక్రయాలకు సంబంధించిన బిల్లులు, ఇన్‌వాయిస్‌లు,ఇతర కీలక పత్రాలను కూడా అధికారులు సీజ్ చేశారు. ఈ ఆపరేషన్‌ను మేడ్చల్ అసిస్టెంట్ డైరెక్టర్ బి. లక్ష్మీ నారాయణ, ప్రశాంతి నగర్ డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ ఆర్. గీతాంజలి ఆధ్వర్యంలో నిర్వహించగా, డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డిప్యూటీ డైరెక్టర్ జి. శ్రీనివాస్ పర్యవేక్షించారు. స్వాధీనం చేసుకున్న పదార్థాల నమూనాలను ప్రయోగశాలకు పంపించి పరీక్షలు నిర్వహిస్తున్నారు. అక్రమ యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రిడియెంట్స్ ల సరఫరా వ్యవస్థ వెనుక ఉన్న వ్యక్తులు, సంస్థలను గుర్తించేందుకు దర్యాప్తు కొనసాగుతోందని డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ తెలిపింది. ఈ వ్యవహారంలో ప్రమేయం ఉన్న వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం ప్రకారం చెల్లుబాటు అయ్యే లైసెన్స్ లేకుండా యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రిడియెంట్స్ ల విక్రయం, పంపిణీ చేయడం తీవ్రమైన నేరమని అధికారులు స్పష్టం చేశారు. ఇటువంటి నేరాలకు గరిష్ఠంగా ఐదు సంవత్సరాల వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఉందన్నారు. అక్రమ ఔషధ తయారీ, విక్రయాలు లేదా నార్కోటిక్, సైకోట్రోపిక్ పదార్థాలకు సంబంధించిన అనుమానాస్పద కార్యకలాపాలపై సమాచారం ఉంటే తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ టోల్‌ఫ్రీ నంబర్ 1800-599-6969కు ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు.

## మోదీ ఎలాంటి భారత్‌ను నిర్మించాలనుకుంటున్నారు?

ఇంధన ధరలను పెంచింది. మే 15న పెట్రోల్, డీజిల్ ధరలను లీటరుకు రూ.3 చొప్పున పెంచారు. అనంతరం మే 19న మరో 90 పైసలు పెరిగాయి. మే 23న పెట్రోల్‌పై 87 పైసలు, డీజిల్‌పై 91 పైసల చొప్పున ధరలు పెరిగాయి. ఇలా తక్కువ వ్యవధిలోనే వరుసగా ధరలు పెరగడం ప్రజలపై అదనపు భారంగా మారిందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. అయితే అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరగడం, డాలర్‌తో రూపాయి మారకం విలువలో మార్పులు, పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల కారణంగా సరఫరా వ్యవస్థపై ఒత్తిడి పెరిగిందని నిపుణులు చెబుతున్నారు. ఈ పరిస్థితులు చమురు మార్కెటింగ్ సంస్థలపై ప్రభావం చూపుతున్నాయని పేర్కొంటున్నారు. ఇంధన ధరల పెరుగుదలతో రవాణా, లాజిస్టిక్స్ ఖర్చులు కూడా పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. దాని ప్రభావం నిత్యావసర వస్తువుల ధరలపై పడే అవకాశం ఉండటంతో ద్రవ్యోల్బణం మరింత పెరగవచ్చని అంచనా వేస్తున్నారు.

# స్నానానికి వెళ్లి - సరదాగా దిగి

- ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో విషాదం

**టి మీడియా, జూన్ 6 , కామారెడ్డి :**



మంజీరా నదిలో స్నానానికి వెళ్లి ముగ్గురు, సరదాగా ఆడుకోవడానికి నీటి కుంటలో దిగి మరో ముగ్గురు చిన్నారులు మృతి చెందారు. ఈ విషాద ఘటన ఉమ్మడి నిజామాబాద్? జిల్లాలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం, కామారెడ్డి జిల్లా పిట్లం మండలం మంగల్?పాడ్? కిష్టాపూర్? గ్రామానికి చెందిన పందరి అనే వ్యక్తి బాన్సువాడ మండలం బుడ్మి శివారులోని మంజీరా నది పక్కనున్న ఎల్లమ్మ గుడి వద్ద విందు ఏర్పాటు చేశారు. దీనికి తన ముగ్గురు సోదరులు, ఇద్దరు సోదరీమణుల కుటుంబ సభ్యులను ఆహ్వానించారు. సాయంత్రం తిరిగి వెళ్లే సమయంలో పందరి సోదరి, లింగంపేట మండలం పరుమళ్ల గ్రామానికి చెందిన అనిత (35), ఆమె కుమార్తె శివాని (13), పందరి కుమార్తె పావని (15), పందరి మరో సోదరి కుమారుడు భానుప్రాసద్? నదిలో స్నానానికి వెళ్లారు. అక్కడ లోతు గమనించకపోవడంతో నలుగురు నీటిలో మునిగిపోయారు. ఒడ్డున ఉన్న ఇతర చిన్నారులు అరవడంతో పందరి సోదరుడు రవి వచ్చి నీటిలో మునిగిన వారిని ఒడ్డుకు చేర్చారు. కొందరు స్థానికులు వారికి సీపీఆర్? చేసి కాపాడే ప్రయత్నం చేశారు. అనంతరం వారిని బాన్సువాడ మాతాశిశు సంరక్షణ ఆసుపత్రికి తరలించారు. కానీ అప్పటికే అనిత, శివాని, పావని మృతి చెందగా, భాను ప్రసాద్? ప్రాణాలతో ఉండటంతో చికిత్స అందిస్తున్నారు. ఒకేసారి ముగ్గురు మృతి చెందడంతో ఆ కుటుంబంలో, వారి స్వగ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

**మరో ఘటనలో ముగ్గురు చిన్నారులు**

గలగలలాడే గంగమ్మ ఒడిలో సరదాగా ఆటలాడుకుంటున్నారు. అలలకు ఎదురొడ్డుతూ జల సవ్వడిలో కేరింతలు కొడుతున్నారు. అంతలోనే వారి ఆనందంపై మృత్యువు పంజా విసిరింది. ఆ అమాయక జీవుల వెన్నువిరిచింది. ఒకేసారి ముగ్గురు చిన్నారులు జలసమాధి అవ్వడం ఆ గ్రామంలో ఊహకందని విషాదాన్ని మిగిల్చింది. పోలీసులు వివరాల ప్రకారం, నిజామాబాద్? జిల్లా భీంగల్?కు చెందిన మహేశ్?-లక్ష్మి దంపతుల పిల్లలు హరీశ్ ?(10), వర్షిణి (5), అలాగే సురేశ్?-పద్మ దంపతుల కుమారుడు అరవింద్? (4)ఈత కోసం ఇంటి సమీపంలోని కుంటలోకి వెళ్లారు. ఈత రాకపోవడంతో నీటిలోకి దిగగానే మునిగి మృతి చెందారు. తల్లిదండ్రులు వెతుకుతుండగా కాలనీ వాసులు కుంట వద్ద చిన్నారుల దుస్తులు గుర్తించి సమాచారం అందించారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది చిన్నారుల మృతదేహాలను వెలికితీసి ఆర్మూర్? సర్కారు దవాఖానాకు తరలించారు.

**ఒంటరైన తల్లి**

వడ్డెర కాలనీకి చెందిన కంది లక్ష్మి, ఆమె భర్త చనిపోయినా కుంగిపోలేదు. దొరికిన కూలీనాలీ చేస్తూ ఒంటిచేత్తో పిల్లలను సాకుతోంది. తన కుమారుడు హరీశ్ (10)కు మాటలు రావు. చెవులు వినపడవు. అతడి భవిష్యత్తుకు అహర్నిశలు శ్రమిస్తోంది. మరోవైపు చిన్న కుమార్తె వర్షిణి (5)ని కంటికి రెప్పలా చూసుకుంటోంది. ఆ తల్లి కష్టాన్ని చూసిన విధి ఎగతాళి చేసింది. ఈతకు వెళ్లిన అన్నాచెల్లి బ్రాహ్మణకుంటలో మునిగి తిరిగిరాని లోకానికి వెళ్లిపోయారు. దీంతో ఆ తల్లి ప్రపంచం మొత్తం చీకటై పోయింది. అల్లారు ముద్దుగా పెంచిన బిడ్డలు లేకుండాపోవడంతో తాను ఎవరి కోసం బతకాలి అంటూ లక్ష్మి రోధించిన తీరు గుండెలను పిండేసింది. అదే కాలనీకి చెందిన సురేశ్?, పద్మ దంపతుల ఆశాదీపం కూడా నీటికుంటలో ఆరిపోయింది. ఆ కూలీ దంపతులు తమ చిన్న కుమారుడు అరవింద్? (4)ను ఎన్నో ఆశలతో పెంచుకుంటున్నారు. విధి ఆడిన వింత నాటకంలో అరవింద్ విగతజీవిగా మారాడు. తల్లిదండ్రులు కన్నబిడ్డ మృతదేహాన్ని చూసి విలపించిన తీరు ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది.

### ఆలస్యంగా ఇంటికొస్తుందని

# కళ్ల ముందే కడతేర్చాడు

**టి మీడియా, జూన్ 6 , హైదరాబాద్ బ్యూరో :**



పని కోసం బయటకు వెళ్లిన భార్య నిత్యం ఆలస్యంగా ఇంటికొస్తోందనే కారణంతో భర్త అనుమానం పెంచుకున్నాడు. ఈ క్రమంలోనే గత కొన్ని రోజులుగా భార్యాభర్తలు తరుచూ గొడవ పడుతున్నారు. ఇదే విషయమై గురువారం రాత్రి కూడా ఆ ఆలుమగల మధ్య వాగ్వాదం ప్రారంభమైంది. అర్ధరాత్రి దాటినా ఆ గొడవ సద్దుమణగలేదు. శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఘర్షణ తారాస్థాయికి చేరింది. దీనిని మనసులో పెట్టుకున్న భర్త, కాసేపు పడుకున్నట్లు నటించాడు. అనంతరం భార్య నిద్రకు ఉపక్రమించగా, తన పిల్లల ముందే ఆమెపై కత్తితో దాడికి తెగబడ్డాడు. కుమారుడు 'నాన్నా, అమ్మను చంపొద్దంటూ' వేడుకున్నా, ప్రాణభయంతో ఇంటి ఇల్లాలు పరుగెడుతున్నా కనికరించలేదు. ఒక దశలో అతడి చేతిలో ఉన్న కత్తి జారిపోగా, పక్కనే ఉన్న స్క్రూ డ్రైవర్?తో కడుపులో పొడిచాడు. అప్పటికీ కోపం చల్లారలేదన్నట్లు ఇనుప రాడ్డుతో ఆమె తలపై బలంగా మోదాడు. తీవ్ర గాయాలతో రక్తమోడుతూ ఆ ఇల్లాలు అక్కడే ప్రాణాలు విడిచింది. ఈ హృదయ విదారక ఘటన అత్తాపూర్? పోలీస్? స్టేషన్? పరిధిలోని తేజస్వినీ నగర్?లో చోటుచేసుకుంది.

**అసలేం జరిగిందంటే?**

అత్తాపూర్? పోలీసులు, ప్రత్యక్షంగా చూసిన కుమారుడు తెలిపిన వివరాల ప్రకారం, మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన కోమలి (31), అవినాశ్ దంపతులు ఆరు నెలల క్రితం బతుకుదెరువు కోసం హైదరాబాద్? నగరానికి వచ్చారు. వీరికి 8, 9 సంవత్సరాల వయసున్న ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ కుటుంబం అత్తాపూర్? తేజస్వీనీనగర్?లోని ఓ అపార్ట్?మెంట్?లో పనికి కుదిరింది. కోమలి కాపలాదారుగా ఉంటూ అదే భవనంలోని పలువురి ఇళ్లలో పని చేస్తోంది. భర్త అవినాశ్?? ఆటోడ్రైవర్?గా పని చేస్తున్నాడు. ఇళ్లలో పని చేసేందుకు వెళ్లిన భార్య కోమలి ఆలస్యంగా ఇంటికి వస్తోందనే కారణంతో భర్త ఆమెపై అనుమానం పెంచుకున్నాడు. ఈ కారణంగా గత కొన్ని రోజులుగా వీరిద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. గురువారం రాత్రి మద్యం తాగి వచ్చిన అవినాశ్?? ఈ విషయమై భార్యతో గొడవకు దిగాడు. శుక్రవారం తెల్లవారుజాము వరకు గొడవ కొనసాగింది. ఈ నేపథ్యంలో తీవ్ర ఆగ్రహానికి గురైన భర్త, భార్యపై కత్తితో దాడికి దిగాడు.

**నాన్నా అమ్మను చంపొద్దు**

ఇదంతా గమనించిన పెద్ద కుమారుడు 'నాన్నా అమ్మని చంపొద్దంటూ' తండ్రిని వేడుకున్నా కూడా అతడు కనికరించలేదు. అక్కడి నుంచి తప్పించుకున్న కోమలి ప్రాణ భయంతో కేకలు పెడుతూ బయటకు పరుగెత్తగా, అవినాశ్ వెంటపడ్డాడు. ఒక దశలో చేతిలో ఉన్న కత్తి జారిపోగా అక్కడే ఉన్న స్క్రూ డ్రైవర్‌తో ఇష్టానుసారంగా కడుపులో పొడిచాడు. అనంతరం పక్కనున్న రాడ్డు తీసుకుని తలపై గట్టిగా మోదాడు. కుమారులు ఇద్దరూ ఏడుస్తూనే అమ్మను కొట్టొద్దని వేడుకున్నారు. అయినా తండ్రి మాత్రం కనికరించలేదు. అదే సమయంలో కోమలి అరుపులు విని అపార్ట్‌మెంట్ వాసులు బయటకు రావడంతో అవినాశ్ అక్కడి నుంచి పరారయ్యాడు. అనంతరం స్థానికులు బాధితురాలిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. కాసేపటికే ఆమె మృతి చెందింది. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# రుతుపవనాల ముందస్తు సందడి

- హైదరాబాద్‌ను ముంచెత్తిన వాన

**టి మీడియా, జూన్ 6 , హైదరాబాద్ బ్యూరో:**



భానుడి భగభగలతో ఉక్కిరిబిక్కిరవుతున్న భాగ్యనగరాన్ని వరుణుడు కరుణించాడు. నైరుతి రుతుపవనాల రాకతో హైదరాబాద్ వ్యాప్తంగా పలుచోట్ల వర్షం కురిసింది. ఫలితంగా ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. జూబ్లీహిల్స్, ఫిలింనగర్, బోరబండ, యూసఫ్‌గూడ, ఎస్?ఆర్?నగర్, సనత్‌నగర్, రాయదుర్గం, మాదాపూర్, గచ్చిబౌలి, ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్ నగర్ ప్రాంతాల్లో వర్షం కురుసింది. హైదర్‌గూడ, ఉప్పరపల్లి పరిసర ప్రాంతాల్లో భారీ వర్షం పడింది. ఈ వాన జల్లులతో నగరవాసులకు ఉపశమనం లభించినట్లైంది. ఇంకోవైపు రంగారెడ్డి జిల్లా కోహెడ, పరిసర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది.

**నగరవాసుల ట్రాఫిక్? కష్టాలు**

నగరంలోని మెహదీపట్నం, విజయనగర్ కాలనీ, మాసబ్ ట్యాంక్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం నమోదైంది. వర్షం ప్రారంభం కావడంతో రోడ్లపై ప్రయాణిస్తున్న వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సాయంత్రం కావడంతో కార్యాలయాలు, వ్యాపార సంస్థల నుంచి ఇంటికి బయలుదేరిన ఉద్యోగులు వాన కారణంగా ట్రాఫిక్? సమస్యలను ఎదుర్కొన్నారు. వర్షం కురవడంతో నగరంలోని పలు ప్రధాన రహదారులపై ట్రాఫిక్ నెమ్మదించింది.

**లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు**

ముఖ్యంగా మెహదీపట్నం జంక్షన్, మాసబ్ ట్యాంక్, విజయనగర్ కాలనీ ప్రాంతాల్లో వాహనాలు భారీగా నిలిచిపోవడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. నగరంలోని కొన్ని లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు రోడ్లపై నిలిచింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అయితే ఎండ తీవ్రత నుంచి ఉపశమనం లభించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

**ఏపీను తాకిన రుతుపవనాలు**

మరోవైపు నైరుతి రుతుపవనాలు ఇవాళ ఆంధ్రప్రదేశ్?లోని రాయలసీమ ప్రాంతాన్ని తాకాయి. మరో రెండు రోజుల్లో రాష్ట్రంలో ప్రవేశించే అవకాశం ఉంది. దీని ముందస్తు ప్రభావం వల్లే రాష్ట్రంలో అక్కడక్కడా వర్షాలు కురుస్తున్నాయి. మరో 3 రోజుల వరకు రాష్ట్రంలో మోస్తరు వర్షాలు పడే అవకాశముంది. అప్పటి లోగా నైరుతి రుతుపవనాలు తెలంగాణలోకి ప్రవేశిస్తే భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది.